

సింగరేణిని కాపాడుకుంటాం

ఎన్ని అడ్డంకులు ఎదురైనా సింగరేణిని కాపాడుకుంటామని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ వెల్లడించారు. 10లో



.. సహకారంతోనే అభివృద్ధి

పరస్పర సహకారంతోనే సమాజం త్వరగా అభివృద్ధి చెందుతుందని ఏపీ హైకోర్టు జడ్జి డాక్టర్ కృపాసాగర్ అన్నారు. 10లో

గరిష్టం / కనిష్టం

32° / 25°

వాతావరణం

జిల్లాలో ఆదివారం వాతావరణం చల్లబడు తుంది. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు జల్లులు కురిసే అవకాశం ఉంది.



భద్రాచలం పట్టణాన్ని ఆనుకుని ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

గోదారి ఉగ్రరూపం

మూడో ప్రమాద హెచ్చరిక జారీ

- భద్రాచలం వద్ద 53.60 అడుగులకు చేరిన నీటిమట్టం
- జలదిగ్బంధంలో ఏజెన్సీ
- స్లూయిజ్‌ల వద్ద మళ్లీ మొరాయించిన మోటార్లు
- పునరావాస శిబిరాలకు ముంపుప్రాంత ప్రజలు

భద్రాచలం : భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం ఉగ్రరూపం దాల్చింది. పది రోజులుగా పెరుగుతూ.. తగ్గుతూ వస్తున్న నీటిమట్టం శనివారం 53 అడుగులు దాటింది. దీంతో సాయంత్రం 4.16 నిమిషాలకు ఆర్డీఓ దామోదర్‌రావు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు పెరగడంతో ఉదయం 7 గంటలకు 50.80 అడుగుల మేర ప్రవహించిన నీటి మట్టం మధ్యాహ్నం 12 గంటలకు 51.90, సాయంత్రం 5 గంటలకు 53.20 అడుగులకు చేరింది. రాత్రి 12 గంటలకు 53.60 అడుగుల మేర నీరు ప్రవహించింది. ఇక చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు 25 గేట్లను తెరిచి నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. నదికి వరద పెరడగంతో భద్రాచలంలోని ఏఎంసీ, అశోక్‌నగర్ కొత్తకాలనీ తదితర ముంపు ప్రాంత ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించారు.

స్తంభించిన రాకపోకలు..

గోదావరి వరదలతో భద్రాచలం ఏజెన్సీ జలదిగ్బంధం అయింది. పట్టణం నుంచి అన్ని వైపులకూ రాకపోకలు స్తంభించాయి. ఏపీలోని రాయనపేట వద్ద ప్రధాన రహదారిపైకి నీరు చేరడంతో కూనవరం, వీఆర్‌పురం మండలాలకు, దుమ్ముగూడెం మండలం తూరుబాక బ్రిడ్జి వద్ద రోడ్డుపైకి నీరు రావడంతో చర్ల, దుమ్ముగూడెం మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చర్ల మండలం బుర్రవేముల గ్రామంలో రోడ్డుపైకి వరద వచ్చింది. వరదతో వెంకటాపురం, వాజేడు మండలాల మధ్య కూడా రవాణా స్తంభించింది. అశ్వాపురం మండలం రామచంద్రాపురంలో కడియాలబుడ్డి వాగుకు వరద పోటెత్తడంతో సారపాక నుంచి నెల్లిపాక మీదుగా



ఏఎంసీ కాలనీలో ఓ ఇంట్లోకి చేరిన వరద నీరు

వెళ్లే వారికి అంతరాయం ఏర్పడింది. బట్టిగుంపు – రాంనగర్ గ్రామాల మధ్య సైతం రాకపోకలు నిలిచిపోయాయి. బూర్గంపాడు – రెడ్డిపాలెం రహదారిపైకి నీరు రావడంతో భద్రాచలం నుంచి అటు వైపు వెళ్లే వాహనాలు ఆగిపోయాయి. ఇలా మొత్తంగా భద్రాచలం నుంచి బీపీఎల్ మీదుగా వెళ్లే రహదారి మినహా అన్ని వైపులా రవాణా స్తంభించింది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు సైతం రాకపోకలు నిలిచిపోయాయి.

మోటార్ల మొరాయింపు..

కరకట్టపై స్లూయిజ్‌ల వద్ద మోటార్ల మొరాయింపు సమస్య మళ్లీ తలెత్తింది. అక్కడ ఏర్పాటు చేసిన మోటార్లు పనిచేయకపోవడం, స్లూయిజ్‌ల లీకేజీతో కాలనీలను వరద నీరు ముంచెత్తుతోంది. దీంతో కాలనీల ప్రజలు పడుతున్న వెతలపై 'సాక్షి' శనివారం సైతం కథనం ప్రచురించింది. అయినా అధికారుల వ్యవహార శైలిలో మార్పు రాలేదు. రెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన మోటార్లు సరిగా పనిచేయకపోవడంతో కొత్తకాలనీ, ఏఎంసీ కాలనీల్లో ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో పంచాయతీ అధికారులు ట్రాక్టర్లను ఏర్పాటు చేసి 33 కుటుంబాలను నన్నపనేని మోహన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరానికి తరలించారు. సాయంత్రానికి వరద పెరగడంతో ముంపు కాలనీల్లోని 106 కుటుంబాలకు చెందిన 346 మందిని పునరావాస శిబిరాలకు తరలించారు. ఇక ముంపు మండలాలకు చెందిన 52 మంది గర్భిణులకు గుర్తించి ముందస్తుగా భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. వరద తగ్గిందంటూ కూనవరం వైపున విజ యవాడ – జగదల్‌పూర్ జాతీయ రహదారిపై ఇటీవల పోసిన కరకట్టను రెండు రోజుల క్రితం తొలగించారు. అయితే గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మళ్లీ తాత్కాలికంగా కట్ట పోసి ఇసుక బస్తాలు అడ్డుకట్టగా వేశారు. దీంతో సుభాష్‌నగర్ కాలనీని ప్రస్తుతానికి వరద చుట్టుముట్టలేదు.

కంట్రోల్ రూం సేవలు వినియోగించుకోండి..

భద్రాచలం వద్ద గోదావరి మూడో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తుండడంతో ముంపు గ్రామాల ప్రజలు అత్యవసర సమయాల్లో కంట్రోల్ రూం సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో 79952 68352, సబ్ కలెక్టరేట్‌లో 08743–232444, 79812 19425 నంబర్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ముంపు ప్రాంతాల వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు.



దుమ్ముగూడెం మండలం బుర్రవేముల వద్ద రహదారిపై వరదనీరు



పునరావాస కేంద్రానికి తరలివెళ్తున్న అశోక్‌నగర్ కొత్తకాలనీ ముంపు బాధితులు

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశా రు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కాగా, స్వామిని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ తదితరులు దర్శించుకుని పూజలు చేశారు.

రేపటి నుంచి సింగరేణి పరిరక్షణ బస్సుయాత్ర

సింగరేణి(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని నిలిపివేయడంతో పాటు తెలంగాణలోని బ్లాక్‌లను సింగరేణికి కేటాయించాలనే డిమాండ్‌తో సీపీఎం ఆధ్వర్యాన కోల్‌బెల్ట్ వ్యాప్తంగా సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర నిర్వహించనున్నారు. ఈ నెల 29వ తేదీ సోమవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఈ యాత్రను మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ప్రారంభిస్తారు. ఈ యాత్ర శ్రీరాంపూర్, రామగుండం, భూపాలపల్లి, మణుగూరు, ఇల్లెందు, సత్తుపల్లి ఏరియాల మీదుగా ఆగస్టు 5వ తేదీన కొత్తగూడెంనకు చేరుకుంది. ఇక్కడ సాయంత్రం 3 గంటలకు సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ముగింపు సభ నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకులు తెలిపారు.

భద్రాచలం వాసికి డాక్టరేట్

భద్రాచలంఅర్బన్: భద్రాచలానికి చెందిన అశోక్ శివకుమార్‌కు డాక్టరేట్ లభించింది. గతంలో కొత్తగూడెంలోని రామచంద్ర డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా విధులు నిర్వర్తించిన ఆయన ప్రస్తుతం మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోధిస్తున్నారు. ఆయన డాక్టర్ సతీష్‌కుమార్ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి గాను ఉత్తరప్రదేశ్‌లోని మోనాడు యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ ప్రకటించారు. ఈసందర్భంగా మణుగూరు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్ శనివారం ఆయనను సన్మానించారు. అధ్యాపకులు జూపూడి అనిల్‌కుమార్, డాక్టర్ అనురాధ, డాక్టర్ రమేష్‌బాబు, జి.రాంతిరుపతి, డాక్టర్ పి.భాస్కర రావు, నాగిరెడ్డి, సాంబమూర్తి, శిరీష, జబ్బర్, సతీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు రండి

ఐటీడీఏ పీఓ రాహుల్



పునరావాస కేంద్రం వద్ద బాధితులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

భద్రాచలంఅర్బన్ : భద్రాచలంలోని ముంపు ప్రాంతాల బాధితులు పునరావాస కేంద్రాలను వినియోగించుకోవాలని ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. పట్టణంలో ఏర్పాటుచేసిన కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ పునరావాస కేంద్రాలకు వచ్చిన ప్రతి కుటుంబానికి నాణ్యమైన ఆహారం, సురక్షిత తాగునీరు అందించాలని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. 24 గంటలూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, వ్యాధుల బారిన పడిన వారికి మెరుగైన సేవలు అందించాలని అన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని ఆ శాఖ సిబ్బందిని ఆదేశించారు. వరద ఉధృతి పూర్తిగా తగ్గేవరకు బాధితులు పునరావాస కేంద్రాల్లోనే ఉండాలని, అధికారులు నిత్యం తోడుగా ఉంటారని భరోసా కల్పించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించిన పీఓ.. గ్రామ పంచాయతీ ఈఓ, సిబ్బందిని అభినందించారు. ఆయన వెంట ఆర్‌ఐ నరసింహారావు, పంచాయతీ ఈఓ శ్రీనివాస్ ఉన్నారు.

వైద్య శిబిరాల ఏర్పాటు

- డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న భాస్కర్‌నాయక్

బూర్గంపాడు: గోదావరి వరద ముంపు ప్రాంతాలు, పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎల్ భాస్కర్‌నాయక్ తెలిపారు. బూర్గంపాడు కేజీబీవీలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రసవానికి సమీపంలో ఉన్న గర్భిణులను గుర్తించి ముందస్తుగా పీహెచ్‌సీలు, ఇతర సురక్షిత ప్రాంతాలకు తరలించి వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. వరద ముంపు ప్రాంతాల్లో జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో శానిటైజేషన్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. పరిశుభ్రమైన ఆహారం, తాగునీరు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో మోరంపల్లి బంజర పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీసాహితి, డీపీఎంఓ శ్రీను, రవి, ప్రియాంక, నాగమణి పాల్గొన్నారు.

అవసరమైతే కరకట్ట ఎత్తు పెంచండి

- పట్టణంలోకి వరద నీరు రావొద్దు
- అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం



కూనవరం రోడ్డులో నిర్మిస్తున్న కరకట్టను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల, రాయల నాగేశ్వరరావు, కలెక్టర్, ఎస్పీ తదితరులు

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి వరద ఉధృతిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం పరిశీలించారు. గోదావరి వరద పట్టణంలోకి రాకుండా అన్ని చర్యలు చేపట్టాలని, అవసరమైతే నూతనంగా నిర్మిస్తున్న కరకట్ట ఎత్తు పెంచాలని అధికారులను ఆదేశించారు. లీకేజీలను మరమ్మతు చేయించాలని సూచించారు. అనంతరం సబ్ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ.. కరకట్ట సక్రమంగా లేకపోవడం వల్లే వరదల సమయంలో భద్రాచలంలోని పలు కాలనీలు ముంపునకు గురవుతున్నాయని అన్నారు. ఈ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు కూనవరం రోడ్డులో యుద్ధప్రాతిపదికన కరకట్ట నిర్మిస్తున్నామని చెప్పారు. వచ్చే ఏడాది నాటికి పూర్తిస్థాయిలో కరకట్ట పనులు పూర్తవుతాయని, ప్రస్తుతం 30 గ్రామాల రాకపోకలకు లక్ష్మీపురం ద్వారా రోడ్డు పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత ఐదు పంచాయతీలు ఏపీలోకి వెళ్లాయని, ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రత్యేకంగా సమావేశమై ఆ గ్రామాలను తిరిగి జిల్లాలో కలుపుతామన్నారు. ప్రస్తుతం గోదావరి 53 అడుగులు దాటినా భద్రాచలం పట్టణంలోకి చుక్కనీరు రాకుండా అన్ని చర్యలు చేపట్టామని అన్నారు. పొలాల్లోకి నీరు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నామని, రైతులకు ఇబ్బంది కలగకుండా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టడంతో పాటు ప్రసవానికి దగ్గరలో ఉన్న గర్భిణులను ముందుగానే ఆస్పత్రులకు తరలించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని, పునరావాస కేంద్రాలతో పాటు ముంపు ప్రభావిత మండలాలకు సరిపడేలా 4వేల క్వింటాళ్ల బియ్యం నిల్వ చేశామని వివరించారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ రాకుండా చూస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఐటీడీఏ పీఓ రాహుల్, ఏఎస్పీ అంకిత్‌కుమార్, ఆర్డీఓ దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం అధ్యయనం చేయాలి

కొత్తగూడెంటౌన్: న్యాయవాదులు చట్టాలతో పాటు తీర్పులను కూడా నిత్యం అధ్యయనం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. కొత్తగూడెంలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. చట్టాలు రోజు రోజుకూ మారుతున్నాయని, హైకోర్టు, సుప్రీం కోర్టులో తీర్పులు కూడా వస్తున్నాయని, వాటిని న్యాయవాదులు గమనిస్తుండాలని సూచించారు. సత్వర న్యాయం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. మూడో అదనపు మెజిస్ట్రేట్ శివనాయక్ మాట్లాడుతూ గతంలో ఉన్న చట్టాలకు ఇప్పుడున్న చట్టాలకు తేడాలను న్యాయవాదులు గుర్తించాలని అన్నారు. సీనియర్ న్యాయవాదులు గంటా విద్యాసాగర్, కేవీకే గుప్తా మాట్లాడుతూ.. నూతన చట్టాలతో సత్వర న్యాయానికి బదులు మరింత అలస్యం అవుతోందని చెప్పారు. కొత్త చట్టాలతో న్యాయవాదులు, పోలీసులు కొంత గందరగోళానికి గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు భానుమతి, రామారావు,



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పాటిల్ వసంత్


రెండో అదనపు మెజిస్ట్రేట్ సాయిశ్రీ, పీపీలు ఆర్. విజయకుమార్, నాగిరెడ్డి, పోసాని రాధాకృష్ణమూర్తి, ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోట్ల మాధవరావు, బొమ్మగాని ప్రభాకర్, దుస్సా జనార్దన్, వై.ఉదయభాస్కర్, లక్కినేని సత్యనారాయణ, బాగం మాధవరావు, సుంకర సత్యనారాయణ, షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరావు, శ్రీనివాస్, పెమ్మసాని పట్టాభి, ఉప్పుశెట్టి సునీల్, ఎంఏ రజాక్, ఎం.వెంకన్న, తోట మల్లేశ్వరావు, విఠల్, నల్లమల ప్రతిభ, అన్నపూర్ణ, జి.సునంద, భానుప్రియ, మనోరమ పాల్గొన్నారు.

'జలశక్తి అభియాన్'ను పటిష్టంగా అమలుచేయాలి

కొత్తగూడెంఅర్బన్: భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా చేపడుతున్న జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఐడీఓసీలో శనివారం 'క్యాచ్ ద రైన్ వెన్ ఇట్ ఫాల్స్' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో నీటి భద్రత, సంరక్షణను నిర్ధారించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. జిల్లాలోని నీటి ట్యాంకుల సరిహద్దులో ఎలాంటి ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో సామూహిక, వ్యక్తిగత ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టాలని అన్నారు. జిల్లా స్థాయిలో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి జలశక్తి అభియాన్ క్యాచ్ ద రైన్ క్యాంపెయిన్ చేపట్టాలని పిలుపునిచ్చారు. వర్షపు నీరు వృథా కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజల్లో అవగాహన పెంచాలని, ఆయా కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేయాలని సూచించారు. జలశక్తి అభియాన్‌లో భాగంగా చెరువుల పునరుద్ధరణ, నీటి సంరక్షణ చర్యలు, వాటర్ షెడ్ల అభివృద్ధి, అడవుల పెంపకం, నీటి మేనేజ్‌మెంట్ చర్యలు విస్తృతంగా చేపట్టాలన్నారు. సమావేశంలో డీఎఫ్ఓ కృష్ణాగౌడ్, జెడ్పీ సీఈఓ కె.చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ విద్యాచందన, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, నీటి పారుదల ఈఈ అర్జున్ రావు, అడిషినల్ డీఆర్డీఓ ఎస్ రవి, డీఏఓ బాబురావు, ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ పాల్గొన్నారు.

స్థానికులుగా గుర్తించండి

- సీఎంకు ఎమ్మెల్యేల వినతి



రేవంత్‌రెడ్డికి సమస్యను వివరిస్తున్న ఎమ్మెల్యేలు

మణుగూరు టౌన్: రాష్ట్ర విభజనకు ముందు ఖమ్మం జిల్లాలో ఉన్న పోలవరం ముంపు మండలాల్లో చదివిన ఉమ్మడి ఖమ్మం–వరంగల్ జిల్లాల నిరుద్యోగులను స్థానికులుగా గుర్తించాలని జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, కోరం కనకయ్య, తెల్లం వెంకట్రావ్ శనివారం సచివాలంలో సీఎంను కలిశారు. టీజీపీఎస్సీ ఓటీఆర్ ఆన్‌లైన్ దరఖాస్తుల్లో వారిని తెలంగాణలో స్థానికేతరులుగా గుర్తించడం వల్ల అవకాశాలు లేక చాలా నష్టపోయారని, ఇప్పటి ఏపీ(పోలవరం ఏడు ముంపు మండలాల్లో) చదివిన భద్రాద్రి, ములుగు జిల్లాలకు చెందిన గిరిజన, గిరిజనేతర నిరుద్యోగుల సమస్యను గత ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. వారి తల్లిదండ్రుల స్థానికత ఆధారంగా తెలంగాణ స్థానికులుగా గుర్తిస్తూ జీవో జారీ చేయాలని కోరారు.

క్లుప్తంగా

లక్కీ డ్రా విజేతలకు బహుమతుల పంపిణీ



బహుమతి అందజేస్తున్న ఎంవీఐ శ్రీనివాస్, పక్కన ఆర్‌ఎం సరిరామ్

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో ఈ నెల 1 నుంచి 15 వరకు పలు రూట్లలోని డీలక్స్ బస్సుల్లో ప్రయాణించిన మహిళల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళా ప్రయాణికుల్లో విజేతలను ఈ నెల 18న లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. వీరికి ఖమ్మం కొత్త బస్టాండ్‌లో శనివారం బహుమతులు అందజేయగా ఎంవీఐ ఎస్.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా మాట్లాడారు. సుశిక్షితులైన డ్రైవర్లు ఉన్న నేపథ్యాన ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం క్షేమమని తెలిపారు. ఆర్టీసీ ఆర్‌ఎం సరిరామ్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం నేపథ్యాన రద్దీ రూట్లలో మహిళల కోసం డీలక్స్ బస్సులను ప్రవేశపెట్టి లక్కీ డ్రా ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్.భవానీప్రసాద్, జీఎన్.పవిత్ర, డిపో మేనేజర్ దినేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలి



ఆర్చరీ కిట్‌ను పరిశీలిస్తున్న పీఓ రాహుల్

పాల్వంచ: క్రీడా పాఠశాల విద్యార్థులకు ఉత్తమ బోధన అందిస్తూనే క్రీడల్లో తర్ఫీదు ఇచ్చి జాతీయస్థాయిలో సత్తా చాటేలా కోచ్‌లు శ్రద్ధ కనబర్చాలని భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. పాల్వంచ మండలం కిన్నెరసానిలోని గిరిజన సంక్షేమ క్రీడా పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పీఓ విద్యార్థులతో మాట్లాడుతూ.. కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్‌లో నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని తెలిపారు. ఈ విషయమై కోచ్‌లు, క్రీడల అధికారి పర్యవేక్షిస్తూ మెనూ ప్రకారం బలవర్ధకమైన ఆహారం అందించాలని చెప్పారు. కాగా, ఆర్చరీలో పిల్లలు కాస్త వెనుకబడి ఉన్నందున మరింత మెరుగైన శిక్షణ ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో క్రీడల అధికారి గోపాల్‌రావు, కోచ్‌లు వాసు, రాంబాబు, ప్రసాద్, కల్తీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినికి ప్రశంసా పత్రం ఇస్తున్న విద్యాశాఖాధికారులు

కొత్తగూడెంఅర్బన్: సకుర కార్యక్రమంలో భాగంగా జపాన్ దేశంలో జరిగే అంతర్జాతీయ వైజ్ఞానిక పోటీలకు ఎంపికలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం కొత్తగూడెం సింగరేణి ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలు జరిపారు. ఈ పోటీల్లో అన్నపురెడ్డిపల్లి కేజీబీవీ విద్యార్థిని పి.వైష్ణవి ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థినిని జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరాజు, జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు తబితారాణి అభినందించారు.

ఎఫ్‌బీఓపై చర్యలు తీసుకోవాలి

దమ్మపేట: సాగులో ఉన్న పత్తి మొక్కలను ధ్వంసం చేసిన అర్లపెంట ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అరుణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వెలకం సుమలత అనే మహిళ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అర్లపెంట గ్రామ పరిధిలో ఎకరం వ్యవసాయ భూమిలో అదే గ్రామానికి చెందిన సుమలత పత్తి పంట సాగుచేస్తోంది. ఈ నెల 26న బీట్ ఆఫీసర్ అరుణ పత్తి మొక్కలను ధ్వంసం చేసిందని బాధితురాలు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు. కాగా ఈ ఘటనపై దమ్మపేట ఫారెస్ట్ రేంజర్ కరుణాకరచారిని వివరణ కోరగా... అటవీశాఖ భూమిలో పత్తి సాగు చేశారని తెలిపారు.

30న డాక్టర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

కొత్తగూడెంరూరల్: భద్రాచలం ప్రభుత్వప్రాంతీయ వైద్యశాలలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఏడు పోస్టులను భర్తీ చేయనున్నట్లు జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ రవిబాబునాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గైనకాలజీ విభాగంలో 3, అనస్తీషియా 2, పిల్లల వైద్య విభాగంలో రెండు పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 30న భద్రాచలం ఆస్పత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,705

వరద కష్టాలు..

గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో భద్రాచలంలో లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. పలు కాలనీల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. ముంపు ప్రాంతాల ప్రజలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. వరద ముంపుతో ఏఎంసీ కాలనీ, అశోక్‌నగర్ కాలనీల ప్రజల అవస్థ పడుతున్నారు. అశోక్‌నగర్ కాలనీలో వరద నీటిని ఎత్తి పోసేందుకు ఏర్పాటు చేసిన మోటార్ల మొరాయించాయి. కాగా కొందరు యువకులు భద్రాచలం పాత బ్రిడ్జి వద్ద సరదాగా ఫొటోలు దిగేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే జాగ్రత్తగా ఉండాలని, ప్రమాదం కొనితెచ్చుకోవద్దని పలువురు సూచిస్తున్నారు. – భద్రాచలంఅర్బన్



అశోక్‌నగర్ కొత్తకాలనీ వద్ద మొరాయించిన మోటార్లు



ఏఎంసీ కాలనీలో కూలిన ప్రహరీ



పునరావాస కేంద్రంలో బాధితులు



మోటార్లు పనిచేయకపోవడంతో అశోక్‌నగర్ కొత్తకాలనీలోకి చేరిన వరద



సున్నంబట్టి-బైరాగులపాడు రహదారిపై చేరిన వరద నీరు



కూనవరం రోడ్డులో వరద నీరు పట్టణంలోకి రాకుండా కట్టను ఏర్పాటు చేసిన అధికారులు



కరకట్ట వద్ద అందుబాటులో ఉంచిన లైఫ్ జాకెట్లు, రబ్బర్ బెలూన్లు, ఇతర రక్షక కిట్లు



భద్రాచలం పాత బ్రిడ్జిపై ప్రమాదపుటంచున ఫొటోలు దిగుతున్న యువకుడు

వరద నీటిలో ప్రధాన రహదారులు

రాకపోకలకు తీవ్ర అంతరాయం

దుమ్ముగూడెం: గోదావరిలో ప్రవాహ ఉధృతి పెరగడంతో మండలంలోని భద్రాచలం-చర్ల ప్రధాన రహదారులపైకి వరద నీరు చేరింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తూరుబాక, బుర్రవేముల గ్రామాల దగ్గర వరద నీరు భద్రాచలం-చర్ల జాతీయ రహదారిపైకి చేరింది. సున్నంబట్టి-బైరాగులపాడు, పర్ణశాల గ్రామంలోకి వెళ్లే రహదారులు నీట మునిగాయి. ఆయా రహదారుల్లో ప్రజలు ప్రయాణించకుండా పోలీసులు బందోబస్తు చర్యలు తీసుకున్నారు. భద్రాచలం దగ్గర గోదావరి నీటిమట్టం 53 అడుగులకు చేరడంతో అధికారులు ముంపు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. గోదావరి ఇంకా పెరిగితే పునరావాస కేంద్రాలకు తరలించనున్నారు. తహసీల్దార్ మణిధర్, సీఐ అశోక్, ఎంపీడీఓ ముత్యాలరావు ముంపు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

మురికికూపంగా గోదావరి

భద్రాచలంఅర్బన్: తెలంగాణలో గోదావరి ప్రవాహం అంతా కొండాకోనల మధ్య నుంచే సాగుతుంది. భద్రాచలానికి ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్ గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా ప్రజలు వస్తుంటారు. ఈ క్రమంలో పట్టణంలోని ఏర్పడే చెత్తను కొన్నేళ్లుగా గోదావరి నది తీరాన కరకట్ట వద్ద అనధికారిక డంపింగ్ యార్డులోనే వేస్తున్నారు. ఇప్పుడు వరదలతో ఆ చెత్త అంతా కరకట్ట చుట్టూ ఒడ్డుకు చేరుకుంది. తీరం అంతా మురికి కూపంగా మారింది.



తూరుబాక వద్ద రాకపోకలు సాగించకుండా పోలీస్ బందోబస్తు



గోదావరి తీరంలో చేరిన చెత్తాచెదారం



కరకట్టపైకి వాహనాలను నిషేధిస్తూ పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



పునరావాస కేంద్రంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్

సింగరేణిని కాపాడుకుంటాం

ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్

మణుగూరుటౌన్/సింగరేణి(కొత్తగూడెం)/కొత్తగూడెం రూరల్/బూర్గంపాడు: ఎన్ని అడ్డంకులు ఎదురైనా సింగరేణిని కాపాడుకుంటామని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ వెల్లడించారు. మణుగూరు ఏరియాలో శనివారం పర్యటించిన ఆయన వివిధ గనుల్లో నిర్వహించిన ఫిట్ మీటింగ్‌ల్లో మాట్లాడారు. సింగరేణిని ప్రైవేటీకరించబోమని చెబుతూనే గనుల వేలానికి సిద్ధమైన బీజేపీ రెండు నాల్కల ధోరణిని అంతా గమనించాలని సూచించారు. వచ్చేనెలలో కార్మికులకు లాభాల బోనస్ వచ్చేలా తమ యూనియన్ కృషి చేస్తోందని తెలిపారు. కార్మికుల వేతనాల పెంపుపై ప్రభుత్వంతో చర్చలు జరుపుతామని తెలిపారు. కాగా, సింగరేణి కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జనక్‌ప్రసాద్ ఆధ్వర్యాన శనివారం కొత్తగూడెంలో సింగరేణి డైరెక్టర్ ఎన్వీకే.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. అలియాస్ పేరు మార్పిడి సమస్యను పరిష్కరించడమేకాక గనుల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, జనక్‌పసాద్‌ను మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో యూనియన్ జనరల్ సెక్రటరీ సి.త్యాగరాజన్, నాయకులు రజాక్, చిన్నయ్య, వత్సవాయి కృష్ణంరాజు, సిల్వేరు గట్టయ్య, మస్తాన్, షాబుద్దీన్, జయరాజ్, మల్లికార్జున్, పీతాంబరం, ఆల్బర్ట్, జె.వెంకటేశ్వర్లు, నాగభూషణం, బి.రాజేశ్వరరావు, మండ రమేశ్, గుండేటి శ్రీనివాస్, వెంకటస్వామి, జాలే జానకీరెడ్డి, యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్న, నూకల రంగారావు, యారం పిచ్చిరెడ్డి, మారం వెంకటేశ్వర రెడ్డి, గోనె రామారావు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్



పూజలు చేస్తున్న అడిషనల్ కలెక్టర్ రాంకిషన్

పాల్వంచ: మండలంలోని శ్రీ కనకదుర్గ దేవస్థానంలోని పెద్దమ్మతల్లి అమ్మవారిని శనివారం హైదరాబాద్ అడిషనల్ కలెక్టర్ రాంకిషన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత సిబ్బంది ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ కిన్నెరసాని పర్యాటక ప్రదేశాన్ని సందర్శించి, రిజర్వాయర్‌లో బోట్ షికారు చేశారు.

మిత్రుడికి మంత్రి కన్నీటి వీడ్కోలు

అనారోగ్యంతో కన్నుమూసిన సీనియర్ నేత జక్కంపూడి



జక్కంపూడి కృష్ణమూర్తి (ఫైల్)

తల్లాడ: విగతజీవిగా ఉన్న ఆప్తమిత్రుడిని చూసి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కన్నీరు మున్నీరయ్యారు. తల్లాడ మండలం బిల్లుపాడుకు చెందిన తుమ్మల ముఖ్య అనుచరుడు, 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఆయన వెన్నంటి నిలిచిన జక్కంపూడి కృష్ణమూర్తి (70) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉదయం మృతి చెందారు. ఈ విషయం తెలియగానే అసెంబ్లీలో ఉన్న మంత్రి తన మిత్రుడిని కడసారి చూసేందుకు వచ్చారు. ఈ నేపథ్యాన జక్కంపూడి మృతదేహాన్ని చూడగానే మంత్రి కన్నీరు ఆగలేదు. ఆపై అంత్యక్రియల్లో ముందుభాగాన నిలిచారు. కాగా, బిల్లుపాడు మాజీ సర్పంచ్, తల్లాడ సొసైటీ మాజీ అధ్యక్షుడైన కృష్ణమూర్తికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన 1982లో బిల్లుపాడు, 1991లో జక్కంపూడి సర్పంచ్‌గా ఎన్నిక కాగా, 1995 నుంచి 2001 వరకు సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. టీడీపీ, బీఆర్‌ఎస్‌లో తుమ్మల ప్రధాన అనుచరుడిగా కొనసాగుతూ ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్నారు. కాగా, జక్కంపూడి అంతిమయాత్రకు మండల వ్యాప్తంగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, స్థానికులు హాజరయ్యారు.



కృష్ణమూర్తి మృతదేహం వద్ద కంటతడి పెడుతున్న మంత్రి తుమ్మల

పరస్పర సహకారంతో సమాజాభివృద్ధి

భద్రాద్రి బ్యాంక్ మహాజన సభలో ఏపీ హైకోర్టు జడ్జి కృపాసాగర్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఏపీ హైకోర్టు జడ్జి కృపాసాగర్, పక్కన బ్యాంక్ చైర్మన్ కృష్ణమూర్తి

ఖమ్మంగాంధీచౌక్: పరస్పర సహకారంతో సమాజం త్వరగా అభివృద్ధి చెందుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి డాక్టర్ కృపాసాగర్ తెలిపారు. ఖమ్మంలో శనివారం భద్రాద్రి కోఆపరేటివ్ బ్యాంక్ 27వ వార్షిక మహాజన సభ నిర్వహించారు. బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి అధ్యక్షతన బ్యాంక్ 27వ వార్షిక మహాజన సభ జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా హాజరైన కృపాసాగర్ మాట్లాడుతూ.. ఒకరికొకరు సహకరించుకోవడం ఆదిమ యుగాల నుంచే ఉందని.. ఈ విధానమే పరిణతి చెందుతూ వస్తోందని తెలిపారు. అందరి సహకారంతో భద్రాద్రి బ్యాంక్ 27 ఏళ్లు గా ప్రగతిపథంలో ముందుకు సాగుతుండటం అభినందనీయమని చెప్పారు. బ్యాంక్ చైర్మన్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ. 604.52 కోట్ల డిపాజిట్లు ఉండగా, 2022-23 నాటికి రూ.298.96కోట్ల మేర రుణాలు ఇచ్చామని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరాంతానికి రూ.346.25కోట్ల వృద్ధి సాధించామని వివరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ మాట్లాడుతూ.. భద్రాద్రి బ్యాంక్ ప్రజల ఆర్థికావసరాలు తీర్చడంలో ముందంజలో ఉండటం అభినందనీయమన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ డీసీఓ సయ్యద్ ఖుర్షీద్ మాట్లాడారు. బ్యాంక్ వైస్ చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావుతో పాటు సన్నె ఉదయ్‌ప్రతాప్, రేఖల భాస్కర్, దేవత రాజారా వు, మద్ది పిచ్చయ్య, బులుసు సాంబమూర్తి, కర్లపూడి నర్మద, కపిలవాయి జయప్రద, పనస శిల్ప, దాసరి వేణుగోపాల్, సత్య నారాయణ, నర్సింహారావు, శ్యాంసుందర్ రావు, రామారావు, గణేశ్‌బాబు తదితరులు పాలన్నారు.

వంట గ్యాస్ లీకై మంటలు

ఇల్లెందురూరల్: సుదిమళ్ల గ్రామపంచాయతీ హనుమంతులపాడులో శనివారం పాయం భద్రమ్మ ఇంట్లో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు ఎగిసిపడ్డాయి. ఇంట్లో వంట చేస్తున్న క్రమంలో సిలిండర్ నుంచి గ్యాస్‌లీకై మంటలు వ్యాపించడంతో ఆందోళనకు గురైన ఆమె బయటకు వచ్చి కేకలు వేసింది. స్థానికులు సిలిండర్‌ను బయటకు తెచ్చి మంటలు ఆర్పడంతో ప్రమాద తప్పింది.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మణుగూరు టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని వితల్‌రావునగర్‌కు జర్పుల హతిరాం ఇంట్లో శనివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. రూ.2.50 లక్షల ఆస్తి నష్టం జరగ్గా, మండల రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదించారు.

మోటార్ల దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ములకలపల్లి: వ్యవసాయ మోటార్లు చోరీకి పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. రాచన్నగూడెం వ్యవసాయ భూముల్లో మోటార్లు చోరీకి గురైనట్లు రైతు మిడియం గోపాల్‌రావు ఈనెల 17 ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు శనివారం కంపగూడెం క్రాస్‌రోడ్డు వద్ద నలుగురు నిందితులు, మొగరాలగుప్పకు చెందిన గడ్డం ప్రసాద్, కీసరి విక్రమ్, కుంజా చందు, తానం సాయిబాబులను అరెస్ట్ చేశారు. మూడు మోటార్లు స్వాధీనం చేసుకుని, రవాణాకు వినియోగించిన ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. నిందితులను రిమాండ్ చేశామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నారని ఎస్సై తెలిపారు.

వైద్య కళాశాలలో సీపీఆర్‌పై అవగాహన



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్

కొత్తగూడెంరూరల్: డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం స్మారకంగా శనివారం వైద్య కళాశాలలో కార్డియో పల్మనరీ రీససిటేషన్ (సీపీఆర్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ ఎల్.భాస్కర్‌నాయక్ మాట్లాడుతూ సీపీఆర్ ద్వారా గుండె నుంచి శరీరంలోని మిగిలిన భాగాలకు రక్తం సరఫరా అవుతుందని తెలిపారు. గుండె, ఊపిరితిత్తులు ఆగిపోయిన తర్వాత కూడా వ్యక్తిని సజీవంగా ఉంచేందుకు సీపీఆర్ సహాయ పడుతుందని తెలిపారు. ఆకస్మికంగా కార్డియాక్ అరెస్ట్‌కు గురైనపుడు సీపీఆర్, ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలేటర్ (ఏఈడీ) చేయాలని అన్నారు. సీపీఆర్, ఏఈడీ తక్షణమే నిర్వహిస్తే బతికే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజాకుమార్, ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వి.మధవరన్, డాక్టర్ తేజస్విని పాల్గొన్నారు.

భూతవైద్యుడు బైండోవర్

దుమ్ముగూడెం: పోలీసులు శనివారం ఓ భూతవైద్యుడిని అదుపులోకి తీసుకుని దుమ్ముగూడెం ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చేశారు. దమ్మపేట మండలానికి చెందిన రేపల్లె తిరుపతి కొంతకాలంగా మండలంలో తిరుగుతూ భూతాలను తరుముతానంటూ డబ్బులు వసూలు చేస్తున్నాడు. కొన్ని రసాయనాలు ఉపయోగిస్తూ మోసం చేస్తున్నాడు. స్థానికుల సమాచారంతో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించి, బైండోవర్ చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు.

పామాయిల్ ఫ్యాక్టరీలో కార్మికుడికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: పామాయిల్ ఫ్యాక్టరీలో శనివారం జరిగిన ప్రమాదంలో ఓ దినసరి కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ మేనేజర్ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పేరాయిగూడేనికి చెందిన తగరం వెంకటేశ్వరరావు కొంతకాలంగా ఫ్యాక్టరీలో దినసరి కార్మికుడిగా పని చేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో కన్వేయర్ బెల్ట్ యంత్రంలో ప్రమాదవశాత్తు చేయి పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుడి చేయి నుజ్జునుజ్జు కాగా గమనించిన తోటి సిబ్బంది ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. వైద్యులు చికిత్స చేసి, నుజ్జునుజ్జయిన చేతిని కొంత భాగం తొలగించినట్లు ఫ్యాక్టరీ మేనేజర్ తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

పాల్వంచ: ఫంక్షన్ హాల్‌లో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. చుంచుపల్లి మండలం పెనుగడప గ్రామపంచాయతీ ములుగుగూడెం గ్రామానికి చెందిన వాడే ప్రవీణ్(22) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మామయ్య వద్దకు వెళ్లి బైక్ తీసుకుని వస్తానని ఇంట్లోలో చెప్పి వచ్చాడు. పాల్వంచ మండలం పెద్దమ్మగుడి సమీపంలోని గంధం వెంకట్రామ్‌కు చెందిన ఫంక్షన్ హాల్లో టవల్‌తో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ శ్రీనివాస్ సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. కాగా మృతికి కారణాలు తెలియరాలేదు. మృతుడి తండ్రి ధర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

గుండెపోటుతో ఏఎస్‌ఐ మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

చంద్రుగొండ : చంద్రుగొండ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న ఉబ్బన శ్రీనివాసరావు (60) గుండెపోటుతో మృతి చెందాడు. శుక్రవారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటన సందర్భంగా శ్రీనివాసరావు బందోబస్తు విధులు నిర్వహించారు. ఈ క్రమంలోనే అనారోగ్యానికి గురయ్యారు. గమనించిన ఎస్‌ఐ స్వప్న ఆయన్ను ఖమ్మం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య విజయకుమారి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామమైన కల్లూరుకు తరలించగా కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, చంద్రుగొండ ఎస్‌ఐ స్వప్న సందర్శించి నివాళులర్పించారు.

ఎస్సై ఆత్మహత్యపై ఏఎస్పీ విచారణ

అశ్వారావుపేటరూరల్: ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య ఘటనపై భద్రాచలం ఏఎస్పీ అంకిత్ కుమార్ సంక్వార్ శనివారం అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో విచారణ చేపట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించే శ్రీనివాస్ సిబ్బంది వేధింపులు భరించలేక గత నెల 30న పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు హైదరాబాద్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన సంచలనం కలిగించగా, రాష్ట్ర ప్రభుత్వం విచారణ అధికారిగా భద్రాచలం ఏఎస్పీని నియమించింది. దీంతో ఆయన ఇప్పటికే ఎస్సై భార్య కృష్ణవేణితోపాటు కుటుంబ సభ్యులను విచారణ చేశారు. తాజాగా అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రీనివాస్ పని చేసిన సమయంలో విధుల్లో ఉన్న సిబ్బందిని వేర్వేరుగా విచారణ చేసి పూర్తి వివరాలను నమోదు చేసుకున్నారు. అయితే వివరాలను అధికారికంగా వెల్లడించలేదు. కాగా, త్వరలో మరో దఫా విచారణ నిర్వహించనున్నట్లు సమాచారం.

గంజాయి అక్రమ రవాణా కేసులో ఒకరు అరెస్టు

అశ్వారావుపేటరూరల్: గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని శనివారం అశ్వారావుపేట పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కరుణాకర్ కథనం ప్రకారం.. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా దారకొండ నుంచి హైదరాబాద్‌లోని దూల్‌పేటకు పనకసకాయల లోడు మాటున రూ.89.83 లక్షల విలువ చేసే 359 కిలోల గంజాయి తరలిస్తుండగా, ఈ ఏడాది మే 25న అశ్వారావుపేటలోని సాయిబాబా ఆలయం వద్ద పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో ఓ మహిళతోపాటు మరో పది మంది వ్యక్తులపై కేసు నమోదైంది. అదే రోజు తొమ్మిది మందిని అరెస్టు చేయగా, ఆదిలాబాద్‌కు చెందిన కొట్నాక్ రమేష్ అనే నిందితుడు పారిపోయాడు. కాగా, పారిపోయిన నిందితుడిని శనివారం హైదరాబాద్‌లో అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ తెలిపారు.